క్లుప్తంగా

రావినూతల వాసికి డాక్టరేట్


జక్కుల సోమయ్య

బోనకల్: మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన జక్కుల సోమయ్య పీహెచ్‌డీ డిగ్రీని పొందారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో చరిత్ర, పురావస్తు శాఖలో పరిశోధనలు పూర్తి చేశారు. అదేవిధంగా రాతి చిత్రాలు, బృహత్ శిలా యుగ నాగరికత, భద్రాది–కొత్తగూడెం తెలంగాణ అనే అంశాలపై పరిశోధనలు చేసి గ్రంథాన్ని యూనివర్సిటీకి అందజేశారు. ప్రొపెసర్ ఆచార్య మురళీమోహన్, విభాగ అధిపతి డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముక్కంటి, డాక్టర్ రమ్మీబేగంతో పాటు గ్రామస్తులు జక్కుల సోమయ్యను అభినందించారు.

ఎన్డీయే కూటమిని ఓడించాలి


మాట్లాడుతున్న ఝాన్సీ లక్ష్మి

వైరా: దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మనువాద మత ఫాసిజాన్ని ముందుకు తీసుకొస్తున్న బీజేపీ ఆర్ఎస్ఎస్ ఎన్డీయే కూటమిని పార్లమెంట్ ఎన్నికలలో ఓడించి బుద్ధి చెప్పాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కోశాధికారి ఝాన్సీ లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం వైరాలోని విక్రమ్ భవన్‌లో ఆ సంఘం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మణిపూర్‌లో 300 మంది మహిళలను దారుణంగా హతమార్చిన చరిత్ర బీజేపీదేనన్నారు. నాటి బ్రిటీష్ ప్రభుత్వానికి ఏజెంట్లా నేటి బీజేపీ నాయకులు పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సునావత్ నీల, ముత్యాల అప్పమ్మ, ఎల్లండి సుభద్ర, గండికోట నాగేంద్ర, తడికమళ్ల జ్యోతి పాల్గొన్నారు.

దేశంలో మంచి ప్రభుత్వం రావాలి

వైరా: దేశంలో మంచి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలందరికీ ఆమోద యోగ్యం అయిన పాలన అందించే వారు అధికారంలోకి రావాలని ఆదివారం వైరా శాంతినగర్ చర్చి ఫాదర్స్, తమిళనాడు రాష్ట్రంలోని వేలాంగిని మాత దేవాలయంలో ప్రత్యేక దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్లు అమృతయ్య, కనపర్తి ప్రకాశం, జ్వాన్నేసు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

వైరారూరల్: మండలంలోని ముసలిముడుగు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్నానాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ చింత నిప్పు రాంబాబు ఖమ్మంలోని శ్రీకృష్ణ ఎమర్జెన్సీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామంలోని పలువురికి పలు రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వైద్యులు కల్యాణపు రమేష్, దుర్గా సురేష్, కిరణ్, విష్ణు, కిషోర్‌కుమార్‌రెడ్డి, జి.ప్రేమ్, కవిత, ముకుంద ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి ఎయిర్ కూలర్ వితరణ



కూలర్‌ను వితరణగా అందజేసిన దాతలు

మధిర: మధిర పట్టణంలోని ఆర్కే ఫౌండేషన్ అనాథాశ్రమానికి మాదాపురం గ్రామానికి చెందిన పుష్పలత వేదాంతరావు ఎయిర్ కూలర్‌ను వితరణగా అందజేశారు. అనాథాశ్రమంలోని వృద్ధులు వేసవి తాపానికి అల్లాడిపోతున్న నేపథ్యంలో రూ.12వేలు విలువ చేసే కూలర్‌ను ఆదివారం ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి దంపతులకు అందజేశారు. మానవతా దృక్పథంతో కూలర్ ను అందజేయడంతోపాటు తరచూ అనాథ ఆశ్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు ఫౌండేషన్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

దుస్తులు పంపిణీ

మధిర: మధిర పట్టణం ఆజాద్ రోడ్డులో కొనసాగుతున్న మహాత్మాగాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంకు నుంచి సంస్థ నిర్వాహకులు లంకా కొండయ్య చేతుల మీదుగా ఆదివారం సంచారవాసులకు ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ.. అనేకమంది దాతలు ఇళ్లలో అదనంగా ఉన్న దుస్తులను, నూతన దుస్తులను తాను నిర్వహిస్తున్న ఓల్డ్ క్లాత్ బ్యాంకుకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ విధంగా సేకరించిన దుస్తులను నిరుపేదలకు అందజేయడం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్‌లో చేరికల చిచ్చు..!

- కొందరి పట్ల విముఖత
- ఎవరిని పడితే వారిని చేర్చుకోం
- కార్యకర్తల అభీష్టం మేరకు
- ఎమ్మెల్యేదే తుది నిర్ణయం


మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

సత్తుపల్లి: 'కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో పని చేసిన వారికి గుర్తింపు ఇవ్వండి.. పదవులు, పైరవీలు, అధికారం ఆశించి స్వార్థం, దుర్బుద్ధితో వచ్చేవాళ్ల అక్కర్లేదు.. ఎవరుపడితే వాళ్లను పార్టీలో చేర్చుకోకండి..' ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ అనుమతి ఉంటేనే పార్టీలో చేర్చుకోవాలంటూ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సభా వేదికపై నుంచే కొందరు నాయకులు చేసిన విజ్ఞప్తి చర్చనీయాంశమైంది. ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు ఐదారుగురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పెద్ద ఎత్తున జరిగిన ప్రచారం చేరికల చిచ్చు రాజేసింది. అయితే కొందరిని పార్టీలోకి తీసుకునేందుకు అభ్యంతరాలు వ్యక్తం కావటంతో ఇద్దరు కౌన్సిలర్లతోనే చేరికలు సరిపెట్టాల్సి వచ్చింది. నియోజకవర్గంలోని ఒక జెడ్పీటీసీ, మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లతో పాటు మరికొందరు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చేస్తున్న ప్రయత్నాల పట్ల స్థానిక నాయకత్వం విముఖత చూపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

కార్యకర్తల అభీష్టం మేరకే..

కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా గ్రామంలో కానీ.. పట్టణంలోని కానీ.. కార్యకర్తల అభీష్టం మేరకే పార్టీలో చేరికలు ఉంటాయని డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ స్పష్టత ఇచ్చారు. పంచాయతీ, మున్సిపల్, ఎంటీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో మీ గ్రామంలో ఎవరైతే గెలుస్తారో వాళ్లనే ఎన్నుకుంటాం తప్పా.. మా జోక్యం ఏమీ ఉండదని, ఆపదలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాం.. జిల్లాలో తొమ్మిది సీట్లు గెలిచాం. ఎన్నికలప్పుడు కష్టకాలంలో పని చేసిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇవ్వటంతో కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

గాంధీభవన్ వేదికగా..

ఎన్నికలప్పుడు కార్పొరేట్ శక్తులకు అమ్ముడుపోయి పార్టీకి తీవ్ర నష్టం చేసి వెళ్లిన కొందరు నేతలు గాంధీ భవన్ వేదికగా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవటంపై మరికొందరు కార్యకర్తలు మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని గ్రూపులమయంగా చేసేందుకే కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని అటువంటి ఆగడాలకు చెక్‌పెట్టాల్సిన అవసరం ఉందని, సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ ఒకటే గ్రూపు అని, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దంపతులకు మంత్రులు రక్షణ వలయంగా ఉండాలని కార్యకర్తలు డిమాండ్ చేయటం చర్చకు దారితీసింది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, కొటూరి మానవతారాయ్‌లు సమావేశానికి దూరంగా ఉన్నారు. వాళ్ల అనుచరులు కూడా సమావేశానికి హాజరు కాలేదు.

ఎమ్మెల్యేదే తుది నిర్ణయం..

కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవాలంటే సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్‌లదే తుది నిర్ణయమని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. ఎవరైనా పార్టీలో చేరాలనుకుంటే ఎమ్మెల్యేను సంప్రదించి సూచనల మేరకు పార్టీలో చేర్చుకుంటామని, కాంగ్రెస్‌లో చేరికలపై మంత్రులు స్పష్టత ఇచ్చారు. అయితే కొత్తగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారు తమ అవకాశాలకు ఎక్కడ గండిపడుతుందోనంటూ కాంగ్రెస్ కార్యకర్తల్లో అంతర్మథనం మొదలైంది. కాగా కొత్తగా పార్టీలో చేర్చుకునేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం.

రోడ్ షోను విజయవంతం చేయండి


తల్లాడ: మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి నామ

తల్లాడ/కల్లూరు: పార్లమెంట్ ఎన్నిక ప్రచారంలో భాగంగా ఈ నెల 29న ఖమ్మంలో, 30న తల్లాడ పట్టణంలో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించే రోడ్ షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఆదివారం తల్లాడమండలంలోని నారాయణపురం గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో, కల్లూరులోని బీఆర్ఎస్ నాయకుడు బొప్పెన రామారావు గృహంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో స్థానికుడునైన తనకే ఓట్లేసి గెలిపించాలన్నారు. హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకున్న కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లేస్తే జిల్లాలో అభివృద్ధి ఉండదన్నారు. ఇప్పటికే కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. తన గెలుపుకు కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలన్నారు. కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీర్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, దిరిశాల దాసురావు, కేతినేని చలపతిరావు, జీవీఆర్, షేక్ ఈసూబ్, దగ్గుల శ్రీనివాసరెడ్డి, సంగసాని శ్రీనివాసరావు, కోటిరెడ్డి, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, సొసైటీ చైర్మన్ లక్ష్మణరావు, కృష్ణ, భాస్కర్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా


ముదిగొండ: కూరగాయల బండివద్ద ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

చింతకాని/ముదిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. చింతకాని మండలంలో ఆదివారం రాత్రి ఆయన రోడ్‌షో నిర్వహించి మాట్లాడారు. అదే విధంగా ముదిగొండలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ముందుగా జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముదిగొండ కళాశాల నుంచి సెంటర్ వరకు ఎన్నిక ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను దగా చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను నమ్మే ప్రసక్తి లేదని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మరోమారు అధికారంలోకి వస్తుందన్నారు. ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి మోదీ ప్రభుత్వం రూ.12 వేల కోట్లు కేటాయించిందని, ఖమ్మం చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, మధిర నియోజకవర్గ ప్రభారి విష్ణువర్ధన్‌రెడ్డి, కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు జ్వాలా నర్సింహారావు, జిల్లా నాయకులు వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు వీరప్రసాద్, మండల అధ్యక్షుడు అల్లిక శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు యరబోలు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన పెద్దమ్మతల్లి తిరునాళ్లు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, విజయబాబు, రఘురామిరెడ్డి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని గుడిపాడు పెద్దమ్మతల్లి తిరునాళ్లు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు నిప్పుల గుండం తొక్కుతూ అమ్మవారిని నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రవేశం చేసి గద్దెనెక్కించారు. అనంతరం పెద్దమ్మతల్లికి మేకలు, కోళ్లు బలిచ్చి పూజలు నిర్వహించారు. ఆలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక పూజలు చేశారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలలోని సుమారు మూడువేల మంది నాయకపోడు గిరిజనులు తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఉడతనేని అప్పారావు, మారుతి సూరిబాబు, మారుతి బాబురావు, పూచి గోవర్ధన్, దొడ్డా శంకర్‌రావు, మాధురి మధు, మద్దినేని బేబి స్వర్ణకుమారి పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో..

పట్టణంలోని జవహర్‌నగర్‌లో ఇటీవల ప్రతిష్టించిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో 16 రోజుల పండుగ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చల్లగుళ్ల నర్సింహారావు, మానుకోట ప్రసాద్, గట్టే వాసు, అద్దంకి అనీల్, దొడ్డాకుల గోపాలరావు, శైలజ పాల్గొన్నారు.

ఆలయానికి ఇత్తడి సామగ్రి అందజేత

మధిర: మధిర పట్టణంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయానికి డీవీఆర్ నాగేశ్వరరావు, పూర్ణిమ దంపతులు ఇత్తడి సామగ్రి అందించారు. వారి కుమారులు జితిన్, భరద్వాజ్ ఆర్థిక సాయంతో రూ.10వేలు విలువ చేసే ఇత్తడి సామగ్రిని ఆలయ అర్చకులు హరి రవిశాస్త్రికి అందజేశారు.

నియామకం

కాంగ్రెస్ ఎన్నికల కోఆర్డినేటర్లుగా రాజశేఖర్, రంగారావు..


బొర్రా రాజశేఖర్


కట్ల రంగారావు

వైరా: వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్లుగా నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ నియామక ఉత్తర్వులు అందజేశారు. దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి సోదరుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డితో పాటు మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌లను వైరా నియోజకవర్గ కోఆర్డినేటర్లుగా నియమించారు. టీపీసీసీ కార్యదర్శిగా పనిచేస్తున్న కట్ల రంగారావును పరకాల నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులిద్దరినీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌లుగా నియమించడం పట్ల వైరా కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లెందు ఎంపీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా పగడాల మంజుల


మంజుల

కారేపల్లి: ఇల్లెందు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా కారేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజులను నియమిస్తున్నట్లు ఆదివారం ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా మంజుల సీఎం రేవంత్‌రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

దాతల సహకారంతో లైబ్రరీ ఏర్పాటు


చిన్నకోరుకొండిలో లైబ్రరీని ప్రారంభించిన దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండిలో ఆదివారం దాతల సహకారంతో లైబ్రరీని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఎస్సై కుమ్మరి రామారావు ముందుకు వచ్చి పోటీ పరీక్షల్లో పాల్గొనే నిరుద్యోగులకు ఉపయోగపడాలనే సంకల్పంతో లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఏఎస్సైతో పాటు మరికొంతమంది కానిస్టేబుళ్లు, హైదరాబాద్‌కు చెందిన వీఐపీ ఐఏఎస్ అకాడమి సంస్థ అధినేత వీవీ అశోక్‌కుమార్ తమవంతు సహకారం అందిస్తామని ముందుకు వచ్చారు. అశోక్‌కుమార్ రూ.20 వేల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలు అందించగా.. మరికొంతమంది దాతలు లైబ్రరీకి అవసరమైన దినపత్రికలు, గ్రంథాలు అందించేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖలో పనిచేసిన విశ్రాంత ఏడీ కుమ్మరి నర్సింహారావు, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, పోలీస్ కానిస్టేబుల్ చెన్న శేషగిరిరావుతో పాటు జూపల్లి రామకృష్ణ, అనూష, నర్మదా, ఇంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం


వైరా: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా/కొణిజర్ల: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మతతత్వ బీజేపీకి ప్రజలు చరమ గీతం పాడాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఆదివారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైరా నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అదే విధంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకై కొణిజర్ల మండలంలోని లింగగూడెం, బస్వాపురం, గోపవరం, రెడ్డిగూడెం, కొండవనమాల గ్రామాల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి పర్యటించి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టులు కూడా మద్దతు ఇవ్వడం శుభసూచకమన్నారు. ఈ నెల 30న వైరాలో కాంగ్రెస్ అభ్యర్థి నిర్వహించే రోడ్ షోకు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు బొర్రా రాజశేఖర్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, సీపీఎం జిల్లా నాయకుడు బొంతు రాంబాబు, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, దానియేలు, సీతారాములు, గంగారావు, నారాయణరావు, వెంకటేశ్వరరావు, రాజశేఖర్, సైదులు, పుల్లయ్య, కాంగ్రెస్ నాయకులు బానోత్ విజయాబాయి, బొర్రా ఉమాదేవి, ఎంపీపీ గోను మధు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..

వేంసూరు: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు.. ప్రసాద్‌రెడ్డి భార్య శ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, గడిపర్తి శ్రీనివాసరావు, జగన్‌మోహన్‌రావు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ సంబరాలు


పూజలు చేస్తున్న స్విమ్మర్స్

మధిర: మధిర ట్యాంక్ బండ్‌పై ఉన్న కట్టమైసమ్మ తల్లికి ఆదివారం మధిర అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాలు చెల్లించి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉదయాన్నే కట్టమైసమ్మ తల్లికి బోనం వండి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభను చాటిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మధిర వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇరుకుల్ల బాలకోటేశ్వరావు మాట్లాడారు. సమాజసేవ కార్యక్రమాల్లో స్విమర్స్, వాకర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం స్విమ్మర్స్ నూతన కమిటీ పరిచయ కార్యక్రమం చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు.

ముగిసిన శ్రీగురువమ్మతల్లి జాతర

కారేపల్లి: మండలంలోని పేరుపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించే శ్రీగురువమ్మతల్లి జాతర ఆదివారం ముగిసింది. చివరిరోజు భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీగురువమ్మతల్లి దేవస్థానం కమిటీ చైర్మన్ పుట్టా నాగేశ్వరరావు, ఆలయ పూజారి సర్వయ్య, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సాగిన జాతర ఆద్యాంతం ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోయింది. జలబిందెలు, పూలకప్పెర, శ్రీగురువమ్మతల్లి–సర్వారెడ్డి స్వామి కల్యాణం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, గ్రామప్రభలు, చివరి రోజు బోనాల సమర్పణతో జాతర ముగిసింది.

అన్నారుగూడెంలో అంకమ్మ తల్లికి బోనాలు


అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఆదివారం అంకమ్మ తల్లికి బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. అంకమ్మ జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీనివాసరావు, చిన్న శ్రీను, సాందీపులు, తుమ్మలపల్లి వెంకటేశ్వర్‌రావు, మారెళ్ల దేవేందర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు

బోనకల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సురబి వెంకన్న, యార్లగడ్డ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సురబి వెంకన్న, కార్యదర్శిగా యార్లగడ్డ శ్రీనివాసరావు, కోశాధికారిగా ఆకెన పవన్, కమిటీ సభ్యులుగా తేనె వెంకటేశ్వర్లు, తమ్మారపు వెంకటేశ్వర్లు, పారా శ్రీనివాసరావు, తమ్మారపు బ్రహ్మం, రేగళ్ల శ్రీనివాసరావు, పోలెబోయిన శ్రీకాంత్, కటికాల శ్యామ్‌బాబు, యార్లగడ్డ శ్రీనులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత్రికేయ వృత్తికి గౌరవం పెంచేలా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తామన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల స్థలాల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామన్నారు. నూతన ప్రెస్‌క్లబ్ కమిటీని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ముదిగొండ: అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు


కారేపల్లి: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముదిగొండ: ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2003–04 పదో తరగతి విద్యార్థులు పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో సమ్మేళన కార్యక్రమానికి హాజరై ఆనందంగా గడిపారు. ఒకరినొకరు పలకరించుకొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మద్దినేని నాగేశ్వరరావు, నాగేంద్రప్రసాద్, కోటేశ్వరరావు, అనంతరాములు, సాంబయ్య, బేబీచంద్ర, చంద్రకళ, నరేష్‌లను సన్మానించారు.

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో 2008–09 టెన్త్‌క్లాస్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 16 సంవత్సరాల తర్వాత వారు కలుసుకొని ఆనందంగా గడిపారు. తమ చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థి భుక్యా శివ అధ్యక్షత వహించగా.. ఉపాధ్యాయులు అజ్మీర నాగేశ్వరరావు, కొర్ర చందర్, సుమన్, లకావత్ శ్రీరామ్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు


తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడిన ఆవులు (ఫైల్)


కారేపల్లి బీసీ కాలనీ సమీపంలో వ్యవసాయ బావుల వద్ద విరిగిపడిపోయిన విద్యుత్ స్తంభం

కారేపల్లి: వారం రోజుల క్రితం గాలిదుమారం, భారీ వర్షానికి విరిగిపోయి కుప్పకూలిన విద్యుత్ స్తంభాలను, ఇప్పటి వరకు సరిచేయకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సూర్యతండా గ్రామంలో తెగిపడిన విద్యుత్ తీగలను సరిచేయకుండా విద్యుత్ సరఫరా చేయడంతో.. మూడు ఆవులు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. కారేపల్లి బీసీ కాలనీ వ్యవసాయ బావుల వద్ద రెండు విద్యుత్ స్తంభాలు గాలి దుమారానికి విరిగిపోయి కుప్పకూలాయి. వీటిని సరిచేసి విద్యుత్ అందించాలని రైతులు ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా.. పట్టించుకున్న పాపాన పోలేదు. అదే విధంగా విశ్వనాథపల్లి గ్రామంలో వ్యవసాయ బావులకు కొత్త విద్యుత్ కలెక్షన్లు ఇచ్చి ఏడాది గడుస్తున్నా.. ట్రాన్స్‌కో అధికారులు ఇప్పటి వరకు విద్యుత్ సరఫరా ఇవ్వటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంట ఎండలకు ఎండి నష్టపోకముందే కరెంట్ అందించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.